కృష్ణాతీరంలో.. ఆంక్షలు


అలయానికి వెళ్లకుండా అడ్డుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

కొల్లాపూర్, పెంట్లవెల్లి, న్యూస్‌టుడే: నల్లమలలోని కృష్ణాతీరంలో ఏపీ వైపు కొందరు అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. ఆలయాల దర్శనానికి వెళ్లే భక్తులకు, నదిలో చేపలవేట సాగించే మత్స్యకారులు, మేత కోసం జీవాలను తీసుకెళ్తున్న కాపరులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. తెలంగాణలోకి ఎలాంటి అడ్డంకులు లేకుండా రాకపోకలు కొనసాగుతుండగా ఏపీ వైపు తీర ప్రాంతాల్లో అడ్డంకులు, ఆంక్షలు విధిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాతీరంలో చాలా ఏళ్లుగా సంబంధాలు, బంధుత్వాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల వేళ ఆలయాల దర్శనానికి రాకపోకలు సాగిస్తుంటారు.

ఇదీ పరిస్థితి : శ్రీశైలం జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని తీర ప్రాంతాల్లో పలు గ్రామాలు, భూములు మునిగిపోయాయి. నదిపైనే మర పడవలు, పుట్టీలపై ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుతో కృష్ణా తీరం, నల్లమల ప్రాంతాల్లో ఆంక్షలు అమలులోకి వచ్చాయి. ప్రధానంగా కొల్లాపూర్ ప్రాంతంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొల్లాపూర్‌లో ఈదమ్మ దేవత, పెద్దకొత్తపల్లిలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనాలకు ఏపీలోని తీర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. తెలంగాణ నుంచి సప్తనదుల వద్ద సంగమేశ్వర క్షేత్రం, చీమలతిప్పకు సమీపంలోని అంకాలమ్మ కోటకు, కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి, ఓంకారేశ్వర ఆలయాల దర్శనానికి వస్తుంటారు. తీరంలోని ఇరు ప్రాంతాల్లో చేపలవేట, జీవాల పెంపకానికి మత్స్యకారులు, కాపరుల రాకపోకలుంటాయి.

ఇబ్బందులు ఇలా.. : కృష్ణాతీరంలో అంకాలమ్మ కోట దర్శనానికి వెళ్లే భక్తులకు ఏపీలోని అటవీశాఖ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో అంకాలమ్మ దర్శనానికి భక్తులు వెళ్తుంటారు. తీరంలో అటవీశాఖ సిబ్బంది అడ్డుకోవడం, రూ. వేలలో జరిమానా విధించడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులకు ఇబ్బందులు సృష్టించడంపై విమర్శలు వస్తున్నాయి. ఏళ్ల నుంచి నదిపై రాకపోకలు సాగిస్తూ కలిసిమెలిసి ఉన్న ప్రజల్లో కొందరు అధికారుల వైఖరితో ఇబ్బందులు నెలకొనే పరిస్థితులున్నాయని తీరవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇరు ప్రాంతాల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమన్వయ పరిచి కృష్ణాతీరంలో ఆంక్షలు లేకుండా ఆలయాల దర్శన, రాకపోకలు జరిగేలా చూడాలంటూ తీరప్రాంతాల వాసులు కోరుతున్నారు.

● నల్లమల అటవీ ప్రాంతం కావడంతో పులులు, క్రూర మృగాలు సంచరించడంతో పాటు, వన్యప్రాణులు సంరక్షణ కోసం పర్యాటకులను, భక్తులను అంకాలమ్మదేవి (కోట) ఆలయం సందర్శనకు అనుమతించడంలేదు. భక్తులు, పర్యాటకులు వెళ్లాలంటే వారం రోజులు ముందే నంద్యాల జిల్లా ఆత్మకూర్ అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో అధికారి వద్ద రుసుము చెల్లించి అనుమతులు తీసుకోవాలి. లేకుంటే ఎవరినీ కూడా అనుమతించం.

-ఎం.పట్టాభి, ఏపీలోని ఆత్మకూరు రేంజి అధికారి

మహిళల రక్షణే షీటీం ధ్యేయం

కందనూలు, న్యూస్‌టుడే: బయటి ప్రాంతంలో అమ్మాయిలకు, మహిళలకు ఆకతాయిల నుంచి ఎలాంటి ఇబ్బందులు కలిగిన డయల్ 100కు సమాచారం అందించాలని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ తెలిపారు. సెప్టెంబరు నెలకు సంబంధించిన అంశాలను గురువారం వెల్లడించారు. 17 ఫిర్యాదులు నమోదు కాగా 08 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. 09 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 18 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడానికి షీ టీం సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారని పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. అధికారులపై వేటు


ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న పొక్లెయిన్(పాత చిత్రం)

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాలో విఫలమైన అధికారులపై వేటు పడింది. ప్రత్యేక నిఘా బృందం సేకరించిన సమాచారం మేరకు వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, బిజినేపల్లి ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వీరిని ఠాణా నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్ల పరిధిలో మొదటిసారి ఎస్సైలపై వేటు పడటంతో గనులు, రెవెన్యూ, పోలీసు అధికారుల్లో చర్చ మొదలైంది. మార్చి నుంచి జూన్ వరకు వాగు పరిధిలో విధులు నిర్వహించి వసూళ్లకు పాల్పడిన అధికారుల్లో భయాందోళన మొదలైంది.

● దుందుభి వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకున్న వ్యాపారులు ఈ ఏడాది జులై వరకు టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. ఉప్పునుంతల మండలం సదగోడు, మొల్గర, తిర్మలాపూర్, దాసర్లపల్లి, కాంసానిపల్లి, వంగూరు మండలం మిట్టసదగోడు, చింతపల్లి, పోతిరెడ్డిపల్లి శివారు వ్యవసాయ పొలాల్లో డంపులు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ. 4వేల చొప్పున అధికారుల అండదండలతో అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి అనుకూల సమయం కావడంతో రవాణా జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన అధికారులపై వేటు పడింది.



శైలపుత్రిగా జోగులాంబ



అలంపూర్, న్యూస్‌టుడే : జోగులాంబ ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అర్చకులు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.

పకడ్బందీగా డిజిటల్ కార్డు సర్వే

కందనూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సభ్యుల డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలని, సర్వేకు అన్ని అందరూ సహకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డు ఉయ్యాలవాడలో గురువారం సర్వేను ప్రారంభించగా కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎలాంటి లోపాలు లేకుండా కుటుంబ సభ్యుల కార్డు సర్వేను ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామాల్లో ముందస్తుగా సర్వేపై ప్రచారం చేయాలన్నారు. కుటుంబ సభ్యులు ఆధారాలతో సిద్ధంగా ఉండి ఇంటికి సర్వే బృందం అధికారులకు సహకరించాలన్నారు. సర్వేను పరిశీలన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక ఐఏఎస్ అధికారి రవిని నియమించినట్లు చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల్లో గురువారం నుంచి ఈనెల 7 వరకు సర్వే నిర్వహిస్తామని సూచించారు. వివరాలు నమోదు చేస్తున్న సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు వచ్చిన తమకు తెలియజేయాలన్నారు. పురపాలక సంఘం కమిషనర్ నరేశ్‌బాబు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి క్వింటాకు రూ. 500లు బోనస్ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయం నుంచి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారితో కలిసి దూరదృశ్య శ్రవణం ద్వారా జిల్లా ఉన్నతాధికారులతో ధాన్యం కొనుగోలు, డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సహకారశాఖ, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. డీఎస్సీ అభ్యర్థుల ధ్రువ పత్రాలను పక్కాగా పరిశీలన చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారులు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శక్తిపీఠంలో ఉత్సవాలు ప్రారంభం



ప్రదక్షిణ చేస్తున్న ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, మాలధారణ భక్తులు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఈవో పురేందర్, అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో ప్రధాన ఆలయాలకు చేరుకొని ఆనతి స్వీకరించారు. గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, కలశస్థాపన, యాగశాలలో నాలుగు వైపులా ప్రత్యేక మండపారాధన మధ్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులతో మహాకలశ స్థాపన చేశారు. లోక కల్యాణార్థం మహాసంకల్పం పాటించి అఖండ దీపారాధన చేశారు. షోడశోపచార పూజలు, తదితరాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు.

శైలపుత్రిగా జోగులాంబ: ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంతెన నుంచి వెళ్లలేక ఆగిన సుబాబుల్ లోడు లారీ

మొత్తుకున్నా వినలే.. ఎత్తు పెంచలే!

శాంతినగర్, న్యూస్‌టుడే: భారత్‌మాల రోడ్డు వంతెనల ఎత్తు పెంచాలని రైతులు మొత్తుకున్నా, నిరసనలు చేసినా, పనులను అడ్డుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు.. యాజమాన్యం ఒప్పుకోలేదు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న వీటి కారణంగా రైతులకు ఇదిగో ఇలా కష్టాలు తప్పవు. రాజోలి నుంచి శాంతినగర్‌కు వచ్చే రోడ్డుపైన నిర్మించిన వంతెన నుంచి వెళ్లలేక గురువారం ఆగిపోయిన సుబాబుల్ లోడు లారీ సాక్షిగా..

వేలాది గ్రామాలకు సమస్యే: గద్వాల జిల్లాలో భారత్‌మాల రహదారి ఎనభై కిలోమీటర్ల దూరం వెళుతోంది. రహదారికిరువైపులా వందలాది గ్రామాలున్నాయి. రహదారితో ప్రస్తుతం ఈ గ్రామాల నడుమ రాకపోకలు తెగిపోయాయి. అక్కడక్కడా నిర్మించిన పదుల సంఖ్యలో వంతెనలు ఇదిగో ఇలా తక్కువ ఎత్తులోనే ఉండిపోయాయి. దీంతో అటూ ఇటూ వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లడం కష్టం కానుంది. కాలువ కట్టలపైనైతే ఈ రహదారిని దాటే పరిస్థితే లేకుండాపోయింది. కాలువ వరకే వంతెన నిర్మించడంతో కట్టను రహదారిలో కలిపేశారు.

నిరసనలు తెలిపినా

వంతెనల ఎత్తు విషయంలో అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. గట్టు మండలంలో ఏకంగా నిరాహార దీక్షలు చేపట్టారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సమస్యపై మీడియాలో మొదటి నుంచీ కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం తుమ్మిళ్ల రైతులు లారీలో సుబాబుల్ తీసుకువస్తూ బ్రిడ్జి వద్ద ఇబ్బంది పడ్డారు. ఎత్తు తక్కువగా ఉండటంతో తీసుకువచ్చిన సుబాబుల్‌లో కొన్ని కిందకు దించి బ్రిడ్జి దాటిని తర్వాత తిరిగి లోడు చేసుకున్నారు. ఇది రైతులకు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల కింద నుంచి సుబాబుల్, ధాన్యం, పత్తి, మిరప, జొన్న, పశుగ్రాసం లాంటివి రవాణా చేయాలంటే ఇదే పరిస్థితి ఎదురుకానుంది.

సమ్మోహనం.. సుందరరూపం



మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి అలంకరణ




మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో ఉమాదేవిగా దర్శనం



అమ్మాపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో..



శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో



కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బాల త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాల్లో వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జనని దర్శనం చేసుకునేందుకు ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు.

-న్యూస్‌టుడే బృందం



పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహబూబ్‌నగర్ : అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో అర్చకులు



కొత్తకోట: కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా...



అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఊట్కూరు: బిజ్వార్‌లో బండారు చల్లుకునే కార్యక్రమంలో భక్తులు



గద్వాల : ప్రతిమను ఊరేగిస్తున్న తెలుగుపేట శివాలయం కమిటీ సభ్యులు



అయిజ అంబాభవాని ఆలయంలో..



గద్వాల గంజిపేటలో..



ఊట్కూరు: అంబాత్రయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి



నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు సందర్భంగా బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు



అచ్చంపేట: కుంకుమార్చన చేస్తున్న భక్తులు



వనపర్తి : చిట్యాలలో..



మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీఆలయంలో భక్తుల సందడి

వృత్తి ఎస్పీ.. ప్రవృత్తి చిత్రలేఖనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృత్తిలో ఎస్పీగా ఉంటూ చిత్రలేఖనం, సాహిత్యాన్ని ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు రావుల గిరిధర్. తల్లి చీరలపైన వేసే డిజైన్లు, ఇంటి ఎదుట అలంకరించే ముగ్గులను చూసి చిత్రాలను గీయడంపై ఆసక్తిని పెంచుకున్నారాయన. సాహిత్యంపై మక్కువ కనబరుస్తూ కవితలు రాశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనే. . చిత్రాలు గీస్తూ, కవితలు రాస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపర్తి ఎస్పీ గిరిధర్.







చిత్రాలను గీస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

స్వచ్ఛంద కార్యక్రమాల్లో

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు రావుల క్షేమ, నిరంజనాచారిల కుమారుడు గిరిధర్. ఆయన పీజీ వరకు చదువుకున్నారు. పలు స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సామాజిక సేవలు ఇష్టంగా భావించే వారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో జైల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించి వరంగల్‌లో విధులు నిర్వహించారు. 2010లో రాసిన సివిల్స్‌లో ఆయన ఉద్యోగం సాధించి డీఎస్పీగా గురజాల, భైంసా, సుల్తాన్‌బజార్, గజ్వేల్‌లో పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పోలీసు శాఖలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017లో ఎస్పీగా పదోన్నతి పొంది డీసీపీగా పనిచేశారు. ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

ప్రవృత్తిలో గురువు తల్లి

తన తల్లి క్షేమను ఆదర్శంగా తీసుకుని చిత్రలేఖనంలో ఆసక్తిని పెంచుకున్నారు. ఆమెకు డిజైనింగ్‌లో ప్రవేశముంది. ఇంటి వద్ద ఆమె వేసే వివిధ రకాల డిజైనింగ్ బొమ్మలను చూసి అనుకరించేవారు. ఇంటి ఎదుట వేసే వాటిని చిత్రరూపంలో ప్రదర్శించడానికి ఆసక్తి కనబర్చేవారు. ఇలా సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆసక్తిని కలిగించే బొమ్మలను గీసేవారు. ఇప్పటి వరకు 60 వరకు బొమ్మలను గీశారు. ఆయన గీసిన బొమ్మలలో జంతుప్రపంచం, పక్షులు, చెట్లు, సెలయేరు వంటి పకృతి రమణీయతలను తన చిత్రాల్లో పొందుపరుస్తున్నారు. సాహిత్యంలోనూ మక్కువ ప్రదర్శిస్తున్నారు. కవితలంటే ఆయనకు పంచప్రాణం. శోధన పేరిట ఆయన కవిత సంపుటి 2020 సంవత్సరంలో ప్రచురితమైంది. పలు కవితలతో కూడిన మరో సంపుటి అహంబ్రహ్మస్మీ అనే కవిత సంపుటి ప్రచురణలో ఉంది.

సమాజ హితమే పరమావధి : సమాజ హితమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తే ప్రజా సమస్యలకు తావుండదు. సేవ చేయాలన్న లక్ష్యం చిన్ననాటి నుంచే అలవడింది. పోలీసు శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉంటూ నా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన శ్రద్ధ వహిస్తున్నా. శాంతిభద్రతలే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నా. వృత్తిలో ఆదర్శంగా ఉండటంతో పాటు ప్రవృత్తిపై సమయం దొరికినప్పుడల్లా శ్రద్ధ చూపుతున్నా.

- రావుల గిరిధర్, ఎస్పీ

పల్లె ఓటర్లు @ 23,22,054

పురుషుల కంటే 13,765 మంది మహిళలు అధికం

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 23,22,054 ఓటర్లున్నట్లు లెక్క తేల్చింది. పురుషులు 11,54,128 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11,67,893 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 13,765 మంది అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరుచేసి ఈ జాబితాను గత నెల 13న ప్రచురించారు. గ్రామ పంచాయతీల్లో వీటికి సంబంధించి గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది జాబితా ప్రచురించగా దీన్ని ఎన్నికల సంఘం వెలువరించింది. దీని ఆధారంగా జిల్లాల వారీగా పంచాయతీలు, వార్డుల్లోని ఓటర్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరో పర్యాయం ఓటరు నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

* నాలుగు జిల్లాల్లో అతివలదే పైచేయి.. : తాజాగా ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ల ఆధారంగా నాలుగు జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో పురుషుల కంటే మహిళలు 7,348 మంది అధికంగా ఉండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళా ఓటర్లు ఏకంగా 5,562 మంది అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,118 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వనపర్తి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 753 మంది ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పురుష ఓటర్లు మహిళల కంటే 1,016 మంది అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు, పంచాయతీలు, వార్డులు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగులాంబ	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03748

నవరాత్రి వేడుకల్లో రాజవంశీయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలిటెక్నిక్ బంగ్లా పక్కన గుడిలో గురువారం నిర్వహించిన నవరాత్రి పూజల్లో రాజా రామేశ్వర్‌రావు వారసుడు రాజా కృష్ణదేవరాయుడు కుమారుడితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



రాజవంశీయులతో అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

అనంతరం జిల్లా అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు రాజా వారిని కలిసి సన్మానించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సతీశ్ యాదవ్ మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలక పాత్ర పోషించారు.



సెంచరీతో రాణించిన నిజామాబాద్ జట్టు క్రికెటర్ విక్రాంత్‌రెడ్డి(137 పరుగులు)

- మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్‌రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో మార్పు కోసమే పాదయాత్ర



కరపత్రాలు అందజేస్తున్న శివార్చక విజయకుమార్ తదితరులు

ఉండవల్లి, న్యూస్‌టుడే: భావితరాలకు ఉపయోగపడే విధంగా నడచుకునేలా ప్రజల్లో మార్పు కోసమే 'బాపూ బాటలో సత్యశోధన పాదయాత్ర' చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభమైన (100 రోజుల్లో 1000 కి.మీ) పాదయాత్ర గురువారం ఉండవల్లికి చేరుకుంది. గ్రామస్థులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తల్లిదండ్రులు, పెద్దలు అలవాటు చేయాలన్నారు. చేనేత వస్త్రధారణకు ప్రోత్సాహం, మద్యం, మత్తు పదార్థాల నివారణ, స్వదేశీ వైద్యం ఆదరించటం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం, యోగా, పౌష్టికాహారం, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అందించడం తదితరాలను వివరించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు. యాత్ర శుక్రవారం ఉండవల్లి నుంచి బొంకూరుకు సాగనుంది.

పోలీస్ అధికారుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి : డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఏఎస్పీ రాములు, అధికారులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారుల నైపుణ్య కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నేరస్థులు ఎవరూ తప్పించుకోవడానికి వీలు లేకుండా నేరాల విచారణ, పరిశోధన మెరుగుపడాలన్నారు. కార్యశాలలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి, ఏఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఏఎస్పీ రామేశ్వర్, వనపర్తి ఏఎస్పీ రామ్‌దాస్, నారాయణపేట ఏఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నర్సింహులు, గద్వాల డీఎస్పీ నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముండే ఓ విద్యార్థిని(17) మహబూబ్‌నగర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో... రవి : దేవర, రమణ : స్వాగ్
కల్వకుర్తిలో... పార్థసారథి : దేవర, అశోక్ : స్వాగ్

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



టమాటా 66, వంకాయ 44, బెండ 44, మిరప 45, కాకర 64, బీర 64, క్యాలీఫ్లవర్ 74, క్యాబేజీ 44, క్యారెట్ 64, దొండ 48, ఆలుగడ్డ 44, ఉల్లిగడ్డ 64, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, మునగకాయ 74, బీట్‌రూట్ 50, ఖీర, 44, బీన్స్ 90.

- న్యూస్‌టుడే. కందనూలు

7న ప్రమాణ స్వీకారం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉమామహేశ్వరం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 7న ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నూతన ఛైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. గురువారం కమిటీ ప్రతినిధులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

పీయూ సహాయాచార్యుడికి పేటెంట్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్రంలో సహాయ ఆచార్యుడిగా పని చేస్తున్న డా.మధు రిమోట్‌తో పనిచేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అనే పరికరం నమూనా రూపొందించారు. మరో ఐదుగురు సహాయ ఆచార్యులతో కలిసి పరికరాన్ని రూపొందించిన ఆయనకు భారత ప్రభుత్వం మేధో సంపత్తి హక్కులను కల్పించింది. గురువారం జిల్లా కేంద్రంలోని పీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకిరణ్, ఇతర అధ్యాపకులు అతడిని అభినందించారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ప్రతి సంవత్సరం పట్టణంలో నిర్వహించే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. గురువారం పుర కార్యాలయంలో అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించి చర్చించారు. దసరా రోజున హనుమాన్ ఆలయం వద్ద జమ్మిపూజ చేసి అనంతరం ఉత్సవ వేడుకల వద్ద రావణ దహనం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అందుకు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ పుర అధ్యక్షుడు శ్రీశైలం, పలు హిందూ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుల సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు రూ.1.07కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి ఎమ్మెల్యే 24 కుల సంఘాలకు మంజూరు చేసిన ప్రొసిడింగ్‌లను ఆయన అందజేసి మాట్లాడారు. అన్ని కుల, మతాలకు సంబంధించిన వారి కోరిక మేరకు ప్రహరీ, సీసీరోడ్లు, ఇతర అవసరాల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాన్‌వాజ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎజాజ్, శ్రీధర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్ల కోనేరుకు పూర్వ వైభవం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో పురాతన కాలానికి చెందిన ఉట్ల కోనేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న కోనేరును అటవీ శాఖ కార్యాలయం పరిసరాల్లో రూ.4 లక్షల వ్యయంతో మరమ్మతులు చేస్తూ నిర్మిస్తున్నారు. ఖర్చులను తగ్గించాలనే ఉద్దేశంతో కోనేరులో శాశ్వత మరమ్మతులకు శ్రీకారం చుట్టామని పుర ఛైర్మన్ శ్రీనివాసులు చెప్పారు. గతంలో ఈనాడులో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించి ఉట్ల కోనేరు వద్ద బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

ప్రశాంత వాతావరణంలో శరన్నవరాత్రులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. గురువారం పదర మండల కేంద్రంలోని ఠాణాను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. దస్త్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం



విద్యుత్తు ఉపకేంద్రంలో నేలకొరిగిన వృక్షాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న అధికారులు

తాడూరు, న్యూస్‌టుడే: మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రంలో పాటు పలు చోట్ల వృక్షాలు, స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దేవీ నవరాత్రి వేడుకలకు భాగంగా ఏర్పాటు చేసిన మండపాలు దెబ్బతిన్నాయి. వర్షంతో చేతికి వచ్చే దశలో పత్తి పంట దెబ్బతిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు ఎన్ని మారినా దళితులకు న్యాయం జరగడం లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు ఆరోపించారు. గురువారం పట్టణ అంబేడ్కర్ చౌరస్తాలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల కార్యదర్శి బయన్నలు జెండాను ఎగరవేశారు. నాయకులు ఆంజనేయులు, జగన్, వెంకటయ్య, రాధాకృష్ణ, విజయ్‌కుమార్, కృష్ణయ్య, మేకల కృష్ణయ్య, చింత ఆంజనేయులు, జగదీశ్, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి తగదు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో శిక్షణలో ఉన్న న్యాయవాది ఖలీల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు ఎదుట విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉపేందర్, వసంతరెడ్డి, మధుసూదన్, శివారెడ్డి, నజీరోద్దీన్, గోవింద్, కురుమయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండగ.. దుర్గమ్మ సంబరం



కొల్లాపూర్: విరిదేల శమీవృక్షం వద్ద అమ్మవారి జెండాను ఎగురవేస్తున్న పుర అధ్యక్షురాలు రమ్య






నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు.. అచ్చంపేట: భక్త మార్కండేయ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు.. కల్వకుర్తి: కుంకుమార్చన చేస్తున్న మహిళలు.. అచ్చంపేట: భ్రమరాంబ దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



తెలకపల్లిలో...



నాగర్‌కర్నూల్: రాఘవేంద్ర కాలనీలో...

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో దుర్గామాతను ప్రతిష్ఠించారు. అమ్మవారు పలు రూపాల్లో మొదటి రోజు ప్రత్యేక పూజలు అందుకున్నారు. కల్వకుర్తిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిదేవిగా దర్శనమిచ్చింది. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోమాత సేవలు, కలశస్థాపన, అఖండ దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ● నాగర్‌కర్నూల్ పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఉత్సవ కమిటీ సభ్యులు మార్కెట్ యార్డు శివాలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవిగా ఊరేగించారు. మహిళలు కోలాటాలు, బొడ్డెమ్మలు చేశారు. ● తాడూరు మండలంలో దేవి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ వేశారు. ● తెలకపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాతలను ఏర్పాటు చేశారు. ● శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కలశస్థాపన చేశారు. తొమ్మిది రోజుల పాటు సరస్వతిదేవి చిత్రపటంతో పాటు కలశం ఉంచి ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారని ప్రధాన అర్చకుడు లక్ష్మణశర్మ తెలిపారు. ఆలయ ఛైర్మన్ డేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు. కొల్లాపూర్‌లో వరిదేల శమీ వృక్షం వద్ద అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. అంబేడ్కర్ కాలనీలో, కన్యాక పరమేశ్వరాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. పుర ఛైర్మన్ మేకల రమ్య పాల్గొన్నారు. ● ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో బాలత్రిపుర సుందరికి ప్రత్యేక పూజలు చేశారు. ● అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయ శివాలయంలో పార్వతీదేవిగా, ఉమామహేశ్వరంలో శైలపుత్రిదేవిగా, భ్రమరాంబ, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ● పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయాలలో, దేవునితిర్మలాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం వారు పూజలు చేశారు. ● అమ్రాబాద్‌లోని అమరేశ్వరాలయం, మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయం, దోమలపెంటలో అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు. ● పెంట్లవెల్లిలోని చౌడేశ్వరీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● కోడేరు, నర్సాయిపల్లి, సింగాయిపల్లి, రాజాపూర్, జనుంపల్లిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు: ఎమ్మెల్యే



డిజిటల్ కార్డు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న కుటుంబ డిజిటల్ కార్డుతో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమాభివృద్ధి పథకాలు అందుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. డిజిటల్ సర్వేకు పైలెట్ ప్రాజెక్టు కింది ఎంపికైన మండల పరిధిలోని కంటోన్‌పల్లి గ్రామంలో డిజిటల్ సర్వేను అధికారులతో కలసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నూతనంగా అమల్లోకి తీసుకొస్తున్న డిజిటల్ కార్డులో కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరిచి ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలో ఆకాశదీపాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు ఫైయాజ్, గిరిగౌడ్, మంజుల, మాజీ సర్పంచి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, సంజీవ్‌యాదవ్, పర్వత్‌రెడ్డి, వెంకయ్యగౌడ్, ఎర్ర శ్రీను, కృష్ణముదిరాజ్, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : డిజిటల్ కార్డుల కోసం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 14వ వార్డులో గురువారం సర్వే చేపట్టినట్లు పుర ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఉంటుందన్నారు. పుర కమిషనర్ శ్యామ్‌సుందర్, కౌన్సిల్ సభ్యులు మనోహర్‌ప్రసాద్, శ్రీను, సోమ్లా, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : అర్హులందరికీ డిజిటల్ కార్డులు అందిస్తామని కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు అన్నారు. డిజిటల్ కార్డుల కోసం పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని దేదినేనిపల్లిని ఎంపిక చేయగా గురువారం వివరాల సేకరణ ప్రారంభించారు.

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో, ప్రత్యేక అధికారి నాగరాజు అన్నారు. గురువారం పురపాలక పరిధిలోని చుక్కాయిపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే చేశారు.

పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన: కలెక్టర్



అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కందనూలు, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పారదర్శకంగా పరిశీలన చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల అందరికి చరవాణి ద్వారా సమాచారం అందించాలన్నారు. రోజుకు ఎంత మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు వస్తున్నారు, ఏఏ అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారని విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను తప్పని సరిగా పరిశీలన చేయాలన్నారు. మొత్తం 285 పోస్టులకు గాను 885 మంది అభ్యర్థుల విద్యా అర్హత పత్రాలను ఈనెల 5 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, జిల్లా పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: పండుగ సమయంలో ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారమివ్వాలని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. గురువారం తిమ్మాజిపేట ఠాణాను సందర్శించిన ఆయన మాట్లాడారు. ఆ సమయంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేందుకు వీలుంటుందన్నారు. కాలనీల్లో, గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండలంలోని ఓ గ్రామంలో అట్రాసిటీ కేసు విషయమై డీఎస్పీ విచారణ నిర్వహించారు. ఆయన వెంట ఎస్సై నరేందర్‌రెడ్డి, ఏఎస్సై ప్రిసిల్లా ఉన్నారు.

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: పండగల సమయంలో ఊర్లకు వెళ్లే వారు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం సీఐ మాట్లాడుతూ దసరా పండగ సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచి ఊర్లకు వెళ్లవద్దని సూచించారు. వెల్దండ, వంగూరు, చారకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలందరు కొత్త వ్యక్తులు అనుమానంగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్సైలు కురుమూర్తి, మహేందర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మురుగు కాల్వ పనులు పూర్తి



కాల్వ తీస్తున్న పొక్లెయినర్

కోడేరు, న్యూస్‌టుడే : కోడేరులోని కొల్లాపూర్ ప్రధాన రహదారి పక్కన ఎస్సీ కాలనీ నుంచి ఉన్న అసంపూర్తి మురుగు కాల్వను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాల్వ అసంపూర్తిగా ఉండడంతో మురుగు దారిపైకి చేరుతోందని గతనెల 27న 'దారిపైనే మురుగు ప్రవాహం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ స్పందించి పొక్లెయినర్ సహాయంతో కాల్వ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

చీకట్లో ధ్రువపత్రాల పరిశీలన



సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చీకట్లో కొనసాగింది. జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో బుధవారం నుంచి పరిశీలన కొనసాగుతోంది. గురువారం అభ్యర్థుల రాక పెరగడంతో విద్యుత్తు సౌకర్యం లేని గదుల్లోనూ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్న సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో చీకటి పడింది. దీంతో మూడు గదుల్లో సెల్‌ఫోన్ల లైట్లు వేసి పరిశీలన చేపట్టారు.




వర్షానికి తడిసిన మొక్కజొన్నలను వేరు చేస్తున్న మహిళ.. కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

రైతు కష్టం వర్షార్పణం

అచ్చంపేట మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్న ధాన్యం చిత్రాలివీ. శంకర్, అర్జునయ్య, రాజుతో పాటు మరో 20 మంది రైతులు పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకురాగా అధికారులు ధరను కూడా నిర్ణయించారు. సంచుల్లో నింపడం ఆలస్యమవడంతో ఆకస్మిక వర్షానికి మక్కలు పూర్తిగా తడిసిపోయాయి. నాలుగు నెలలుగా కష్టపడి సాగు చేసి మార్కెట్‌కు తీసుకువచ్చిన పంట వర్షానికి తడిసి, కొట్టుపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు కూడా పరిశీలనకు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, అచ్చంపేట న్యూటౌన్

నకిలీ విత్తనాలు విక్రయించారని రైతుల ఆందోళన

కందనూలు, న్యూస్‌టుడే: తాడూరు మండలం చర్ల ఇటిక్యాలకు చెందిన కొంత మంది రైతులు గురువారం పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన సాంబయ్య, రామచంద్రయ్య, రామకృష్ణ అనే రైతులు మాట్లాడారు. వ్యాపారి వద్ద 50 రోజులకు దిగుబడి వచ్చే వరి ధాన్యం కొనుగోలు చేసి సాగు చేస్తే ఇప్పటి వరకు ఎలాంటి దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారి నకిలీ విత్తనాలు విక్రయించడంతో పంట నష్టం జరిగిందని ఆరోపించారు. ఎకరాకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దుకాణం వద్దకు వ్యవసాయశాఖ ఏడీ వాసు వచ్చి రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. రైతులు సాగు చేసిన పంటను పరిశీలించి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కందనూలు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యాపారుల కోసం పని చేయడం సరైన విధానం కాదన్నారు. నాయకులు బాల్‌రెడ్డి, గోపాల్, లక్ష్మణ్, ఆర్. శ్రీనివాసులు, మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మియాపూర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని మియాపూర్ ఠాణా పరిధిలో గతనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా అప్పట్లో అతని వద్ద గుర్తింపు ఆధారాలు లభించలేదు. వాహన వివరాలు సైతం పోలీసులకు అందలేదు. ఈ కేసు విచారణను చేపట్టిన ఎస్సై మాణిక్యం సిబ్బంది సాయంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలో దొరికిన చిన్న ఆధారాలతో దర్యాప్తు నిర్వహించగా మృతుడు నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లికి చెందిన కోటయ్య(35) గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సైతం సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని ఎస్సై తెలిపారు. కోటయ్య భార్య చనిపోవడంతో ఒంటరిగా మియాపూర్ లక్ష్మినగర్‌లో ఉంటూ మేస్త్రీ పనులు చేస్తూ జీవిస్తున్నాడని వారి బంధువులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దేవునితిర్మలాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి(35) బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. భర్త నగేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెన్నచర్ల నుంచి వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్ర గాయాలైన లక్ష్మిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. కుమారుడు దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు.

పాముకాటుతో పారిశుద్ధ్య యువకుడు..

అమ్రాబాద్, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య పనులు చేస్తుండగా పాముకాటుకు గురై పంచాయతీ కార్మికుడు మృతి చెందారు. ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన ముత్యాలు(50) కొన్నేళ్లుగా పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం విధులు నిర్వహిస్తుండగా చేతికి పాము కరిచింది. ఏదో గుచ్చుకొని ఉంటుందిలే అనుకొని నిర్లక్ష్యం చేశారు. చేయి భాగం నల్లగా కమిలిపోవడంతో ఉదయం ఆసుపత్రికి వెళ్లొచ్చని రాత్రి పడుకొని అలాగే మృతి చెందారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకటమ్మ ఏడాది క్రితమే మృతి చెందారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

తెలకపల్లి : ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గౌరెడ్డిపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గోలగుండం నుంచి బయలుదేరిన ఆటో గౌరెడ్డిపల్లి వైపు వస్తుండగా అదే గ్రామం నుంచి ద్విచక్ర వాహనదారుడు ఆటోను అధిగ మించి రోడ్డుపై నిలిచి ఉన్నాడు. వేగంగా వచ్చిన ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోలగుండంకు చెందిన వృద్ధుడు బిచ్చయ్యకు, కొండారెడ్డిపల్లికి చెందిన యువకుడు మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాద సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కారు ఆటో ఢీ..ముగ్గురికి..

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: కారు ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి వెల్దండ మండలం కొట్ర శివారులో హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి వస్తున్న కారు, కల్వకుర్తి నుంచి కొట్ర గ్రామానికి బయలుదేరిన ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ముంగలిశెట్టి శేఖర్, ప్రయాణికుడు ఓరుగంటి కృష్ణయ్య కారులో ప్రయాణిస్తున్న తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన శ్రీనువాసులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏటీఎంలో రూ.500కు బదులు రూ.10, 20 నోట్లు

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఏటీఎంలో నగదు తీసుకునేందుకు వెళ్లిన వినియోగదారులకు రూ.500 స్థానంలో రూ.10, 20 నోట్లు రావడంతో ఆశ్చర్యపోయారు. బాధితుల కథనం ప్రకారం.. మన్ననూరు ఎస్బీఐ బ్రాంచి ఆవరణలోని ఏటీఎంలోకి జీసీసీ ఉద్యోగి రాములు రూ.20 వేలు తీసుకునేందుకు బుధవారం వచ్చారు. ఏటీఎం నుంచి రూ.500 నోట్లు 39, ఒకటి రూ.10 నోటు వచ్చింది. మరో వ్యక్తి రాజారాం రూ.15 వేలు తీసుకునేందుకు ప్రయత్నించగా 29 రూ.500 నోట్లు, ఒక రూ.20 నోటు వచ్చింది. న్యాయం చేయాలంటూ బ్యాంకు మేనేజరు రాములుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరుపుతామని మేనేజరు తెలిపారు.

ఆరుగురు వేటగాళ్లు రిమాండ్‌కు

దోమలపెంట(అమ్రాబాద్), న్యూస్‌టుడే : సాంబర్ దుప్పిని వేటాడిన సంఘటనలో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దోమలపెంట రేంజ్ అధికారి గురుప్రసాద్ కథనం ప్రకారం.. గత నెల 30న రాత్రి సార్లపల్లి సమీప అటవీ ప్రాంతంలో ఓ సాంబర్ దుప్పిని ఆయుధాలతో చంపారు. ఈనెల 1న విచారణ చేయగా కుడిచింతలబైలుకు చెందిన మండ్లి మల్లేష్, మండ్లి చిన్న మల్లయ్య, శీలం ఈదయ్య, గోరేటి శ్రీను, సార్లపల్లికి చెందిన ఆర్తి కొండలు, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన వరికుప్పల రమేష్‌లు నిందితులుగా తేలింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి గురువారం అచ్చంపేట న్యాయస్థానంలో హాజరు పర్చారు. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించగా కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

గంజాయి నూనె రవాణాదారుల అరెస్టు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై గంజాయి నూనెను రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గురువారం ఏనుగొండ సమీపంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ధర్మేంద్రరాయ్, నరెట్టమ్‌రాయ్ గంజాయి నూనెను హైదరాబాద్, రాయచూర్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఆ నూనెను మత్తు కోసం సిగరెట్ తాగేటప్పుడు వాడుతారు. గురువారం హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు నూనెను వారు మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ వద్ద తనిఖీలు చేయగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.25లక్షల విలువ చేసే గంజాయి నూనె లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివ, పాల్గొన్నారు.